ఫ్లోరైడ్‌ను అశ్రద్ధ చేయొద్దు

కోటవురట్ల: ఫ్లోరైడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టరు విశ్వనాథం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు ఫ్లోరైడ్ ప్రభావంపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫ్లోరైడ్ ప్రభావంతో తీవ్ర దుష్ఫలితాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఫ్లోరైడ్ సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న నీళ్లను తాగడం వల్ల ఎముకలు బలహీనపడడం, తొందరగా ముసలితనం, కీళ్ల నొప్పులు వస్తాయని తెలిపారు. పిల్లల్లో దంతాలపై మచ్చలు రావడం, బలహీనపడడం జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, కమ్యూనిటీలో సర్వే చేయనున్నామన్నారు. యండపల్లి, తంగేడు, సుంకపూరు, లింగాపురం, కొడవటిపూడి, కోటవురట్ల సచివాలయాల పరిధిలో సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవోలు టి.బుల్లిబాబు, కె.బెన్నయ్య, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మునగపాక: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. గురువారం ఆయన మునగపాకలోని ఎంఎస్ఆర్ నేషనల్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు పెరిగిపోయాయన్నారు. ఆన్‌లైన్ పేమెంట్లు, నకిలీ యాప్‌లతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. స్త్రీ శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.





విలీన పంచాయతీల్లో కానరాని అభివృద్ధి

- కొక్కిరాపల్లి పంచాయతీని డీనోటిఫై చేయాలని డిమాండ్
- టీడీపీ సభ్యుడు రామకృష్ణపై వైస్ చైర్మన్ల ఆగ్రహం
- వాడీవేడిగా యలమంచిలి కౌన్సిల్ సమావేశం

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ ఏర్పడి 14 ఏళ్లు పూర్తి కావస్తున్నా విలీన గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఎర్రవరం వార్డు సభ్యుడు పిట్టా సత్తిబాబు, కొక్కిరాపల్లి సభ్యుడు మజ్జి రామకృష్ణ సహా పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. పంచాయతీగా ఉన్నప్పుడే ప్రజలు సంతృప్తిగా జీవించారని, ఉపాధి హామీ పథకంతో ఉపాధి పొందేవారని, ఇప్పుడు అవన్నీ జరగడం లేదని, కొక్కిరాపల్లి గ్రామాన్ని మున్సిపాలిటీ నుంచి డీ నోటిఫై చేయాలని కోరుతూ ప్రతిపాదించారు. దీనిపై తీర్మానం చేయాలని రామకృష్ణ పట్టుబట్టారు. మున్సిపాలిటీలో విలీనం చేయాలని అప్పట్లో ఎందుకు తీర్మానం చేశారని చైర్‌పర్సన్ రమాకుమారి ప్రశ్నించారు. దీని వల్ల లాభాలు, నష్టాలు కూడా ఉన్నాయన్నారు. అభివృద్ధి దశల వారీగా జరుగుతుందన్నారు. డీ నోటిఫై చేయడం అంత సులభం కాదన్నారు. అదే జరిగితే అందరికీ మంచిదేనని, ముఖ్యంగా యలమంచిలి పట్టణానికి, ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొక్కిరాపల్లి గ్రామాభివృద్ధి కుంటుపడిందని వార్డు సభ్యుడు రామకృష్ణ చెప్పడంతో వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వర్రావు, అర్రెపు గుప్తా తీవ్ర అభ్యంతరం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలైంది కదా.. ఎందుకు నిధులు తెచ్చుకోలేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వార్డులకూ సమాన ప్రాధాన్యతనిచ్చామన్నారు. పీఎం సూర్యఘర్ పథకంతో పాటు అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్‌ను ప్రజలు, రియల్టర్లు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని చైర్‌పర్సన్ రమాకుమారి కోరారు. పట్టణంలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటోందని,కొత్తపాలెంలో లోవోల్టేజి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కొందరు సభ్యులు లేవనెత్తారు. అజెండాలో ఐదు, అత్యవసర అజెండాలో మూడు అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు రాపేటి సంతోష్, సుంకర మరిణేశ్వర్రావు, పలువురు మహిళా సభ్యులు, కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


టీడీపీ సభ్యుడు రామకృష్ణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ చైర్మన్లు నాగేశ్వర్రావు,అర్రెపు గుప్తా

గ్రామాల్లో పీ-4 సర్వే

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో పీ-4 నీడ్ సర్వే చేపడుతున్నట్లు ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. నిరుపేద కుటుంబాలను గుర్తించి ఆర్థికంగా, సామాజిక భరోసాతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఈ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శ్రీరాంపురం గ్రామంలో గురువారం జరిగిన సర్వేను ఎంపీడీవో పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వై.వి.సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

నూకాంబిక ఆలయ భూమి సాగు వేలం

ఎస్.రాయవరం: నూకాంబిక అమ్మవారు ఆలయానికి చెందిన భూమి సాగు వేలం పాట రూ.42 వేలకు పలికింది. ఈ మేరకు ఈవో సాంబశివరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. అమ్మవారి ఆలయానికి 2.8 ఎకరాలు ఉండగా.. ప్రస్తుతం 1.8 ఎకరాలు సాగు చేసేందుకు గురువారం గ్రామంలో వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన చల్లపల్లి సత్యనారాయణ దక్కించుకున్నారు. అయితే ఈ భూమిలో గత దశాబ్దాల కాలంగా నిరుపేదలు పండిచుకుని తక్కువ మొత్తంలో శిస్తు చెల్లించేవారు. వేలంలో అధిక ధర పలకడంతో రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఎకరా భూమి కౌలుకు రూ.10 వేలకు మించి ఎవరూ తీసుకోవడం లేదు. అటువంటిది 1.8 ఎకరాలను రూ.42 వేలు వరకు పాటీకి వెళ్లడంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

బీమాతో కుటుంబానికి ధీమా

ఎస్.రాయవరం: కార్మికులు, వ్యవసాయ కూలీలు విధిగా బీమా సౌకర్యం పొందాలని కొరుప్రోలు మాజీ సర్పంచ్ పుట్టా సుధాకర్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ శ్రమ్ కార్డులతో ఉచిత ఇన్సూరెన్స్ కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సుమారు 200 మందికి గురువారం బీమా నమోదు చేయించారు. ఈ పథకంలో రిజిస్టర్ అయిన వారికి ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2 లక్షలు, అంగ వైకల్యానికి రూ.లక్ష వరకు పరిహారం అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బిక్కిన శ్రీను, ఉప సర్పంచ్ కొరపాటి గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మశ్రీ జన్మదిన వేడుకలు

యలమంచిలి రూరల్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ జన్మదిన వేడుకలు గురువారం యలమంచిలిలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ధర్మశ్రీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యలమంచిలి పట్టణ, మండల అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వర్రావు, అర్రెపు గుప్తా, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం తిర్నాథరావు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: ధర్మశ్రీ జన్మదినం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కొండకర్ల ఇబ్బా ఫౌండేషన్‌లో కరణం సూర్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేయడంతో పాటు, పిల్లలకు భోజన సదుపాయం కల్పించారు. ఫౌండేషన్‌కు రూ.5 వేలు విరాళం అందజేశారు.

మునగపాక: మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణుల నడుమ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మళ్ల సంజీవరావు, తదితరులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కాండ్రేగుల నూకరాజు, దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగప్పలనాయుడు, పెదబ్బాయి, ఎంపీటీసీలు ఇల్లా శిరీషా నాగేశ్వరరావు, మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.


యలమంచిలిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

మునగపాక: ప్రతి ఒక్కరూ మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. మండలంలోని తోటాడ పంచాయతీ పరిధిలో త్రిమూర్తుల ఆలయ సమీపంలో తలపెట్టిన మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి గురువారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, పెద్దలు దొడ్డి బాలాజీ, దొడ్డి కోటేశ్వరరావు, పాలమర శెట్టి మురళి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహం తరలింపునకు చర్యలు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా మునగపాక మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న అభయాంజనేయస్వామి విగ్రహాన్ని తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ఆంజనేయ మూల సంఘ రైతులు సమావేశమయ్యారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని నెలకొల్పి ఏటా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అయితే పూడిమడక రోడ్డు విస్తరణలో విగ్రహం తొలగించాల్సి రావడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించారు. ఇదిలా ఉండగా ఆంజనేయ స్వామి కాంప్లెక్స్‌ను తొలగించేందుకు ప్రభుత్వం రూ.22.50 లక్షల చెక్కు అందజేయడంతో ఆంజనేయ మూల సంఘ రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పెంటకోట జగ్గప్పారావు, పెంటకోట జగన్నాథరావు నాయుడు, సూరిశెట్టి కన్నారావు, ఆదారి లక్ష్మణరావు, పెంటకోట అచ్చియ్యానాయుడు, వెలగా అప్పలనాయుడు, ఆదారి గోపీ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి చేయండి

కోటవురట్ల: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో గురువారం సమీక్ష నిర్వహించారు. పీ-4 సర్వే, పారిశుధ్య అంశాలు, పింఛన్ల పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ పీ-4 సర్వే పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నందున పారిశుధ్య డ్రైవ్ చేపట్టి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి పథకాలలో క్లోరినేషన్, డ్రైనేజీలలో పూడికతీత, బ్లీచింగ్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, ఈవోపీఆర్డీ రఘురాం పాల్గొన్నారు.











